నమస్తే తెలంగాణ

# నాగర్‌కర్నూల్

5 | మహబూబ్‌నగర్, గురువారం 27 జూన్ 2024 | NAGARKURNOOL




ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్‌ను ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్, నాయకులు బైకాని శ్రీనివాస్‌యాదవ్, రంగినేని అభిలాష్‌రావు ఉన్నారు.

### కరెంట్ ఎప్పుడొస్తుందో తెలియడం లేదు..



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రైతు రాజు అయ్యాడు. బీఆర్ఎస్ హయాంలో 24గంటల కరెంట్ ఉచితంగా రైతులకు అందించగా కాంగ్రెస్ హయాంలో ఏడు గంటల కరెంట్ సక్రమంగా అందేది కాదు. రాత్రి వేళలో ఉండడంతో రైతులు పొలాల వద్ద పడిగాపులు గాసి పాముకాటుకు, కరెంట్ షాక్‌కు గురై ఎంతో మంది ప్రాణాలొదిరారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఏర్పడడంతో పాత రోజులను మళ్లీ గుర్తు చేస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో రెండు పంటలు పండించిన రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క పంట కూడా పండించలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఒక సర్వసభ్య సమావేశంలో ట్రాన్స్‌కో డీఈ మాట్లాడు తూ రైతులు, ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన కరెంట్ 24 గంటలు అందిస్తున్నదని సభలో చెబుతున్న సమయంలో కరెంట్ పోవడంతో అధికారులు అవాక్కయ్యారు. ఈ ప్రభుత్వంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందుదో ఇటు రైతులు, సామాన్య ప్రజలకు అర్థంకాని ప్రశ్నగా మిగిలిపోయింది.

*- ప్రవీణ్‌రెడ్డి, రైతు, ఎర్రవల్లి చౌరస్తా, జోగులాంబ గద్వాల జిల్లా*



తెలంగాణ రాకముందు కరెంట్ కోసం బోరు వద్దే చిన్నారితో కలిసి నిద్రిస్తున్న రైతు

# అన్నదాతల అరిగోస

- కోతలతోనే కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్ సర్కారు
- కుట్రపూరిత పోకడలు మానుకోవాలని సూచిస్తున్న కర్షకలోకం
- కేసీఆర్ హయాంలో వ్యవసాయానికి నిరంతర కరెంట్..
- క్షణం కట్ లేకుండా సరఫరా అయ్యేదని గుర్తు చేసుకుంటున్న రైతులు

'తెలంగాణ రాష్ట్రం రాకముందు వచ్చీరాని కరెంట్‌తో అరిగోసపడ్డం. ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడుపోతుందో తెలియక ఇబ్బందులు పడ్డాం. పంటలకు నీళ్లు పారించేందుకు సకాలం లో కరెంట్ ఉండక వ్యవసాయం ఆగమైంది. రాత్రిపూట పొలాల వద్ద జాగరణ చేయాల్సి వచ్చేది. సాగునీళ్లు అందక.. పంటలు పండక ఎంతో మంది రైతులు అప్పులపాలై ప్రాణాలు తీసుకోవాల్సి వచ్చింది. ఇలా దారుణమైన, దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొన్న రైతుల జీవితాల్లో కేసీఆర్ ప్రభుత్వం వెలుగులు నింపింది. స్వరాష్ట్రాన్ని సాధించడమే గాకుండా ముందుచూపుతో ప్రత్యేక చొరవతో 24 గంటలూ నాణ్యమైన విద్యు త్‌ను సరఫరాచేసి వ్యవసాయానికి ఎలాంటి లోటు లేకుండా చేసింది. ఒకవైపు పెట్టుబడి సాయం, రైతుబీమా.. మరోవైపు పుష్కలంగా సాగునీరు, నిరంతర విద్యుత్ అందించి రైతును రాజు చేశారు. దీంతో దర్జాగా పంటలు సాగు చేసుకున్నాం' అంటూ ఉమ్మడి జిల్లా అన్నదాతలు చెబుతున్నారు. ఒక వ్యవసాయమే కాదు.. అన్ని రంగాలనూ గాడిన పెట్టి 'పవర్‌ఫుల్ తెలంగాణ'గా నిలబెట్టిన కేసీఆర్‌ను.. కాంగ్రెస్ సర్కారు కావాలనే విద్యుత్ కొనుగోళ్ల విషయంలో బద్నాం చేస్తున్నదని మండిపడుతున్నారు.

ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి కుట్రపూరిత పోకడలు మాని వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

*- మహబూబ్‌నగర్, జూన్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



### కోతలు ఉండొద్దంటే కేసీఆర్ సారే రావాలి..

కాంగ్రెసోళ్ల పాలనలో రాష్ట్రం పదేండ్లు వెనక్కి పోయినట్లుంది. అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే కరెంట్ కష్టాలు షురు ఐనయ్. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న కరెంట్ కష్టాలను కాంగ్రెస్ మల్లా తీసుకొచ్చింది. తెలంగాణ రాకముందు ఎవుసం చేయడం శానా కష్టంగా ఉండేది. రాత్రిపూట మాత్రమే బోర్ల కరెంట్ ఇచ్చేటోళ్లు. అదికూడా పోయి పోయి వచ్చేది. రైతులందరూ సేన్ల కాడనే పండుకునేటోళ్లం. కరెంట్ పోయి వచ్చినప్పుడల్లా మోటర్లు ఆన్ చేసుకునేవాళ్లం. నిద్రమబ్బుల మోటర్ ఆన్ చేయనిక్కె పోయి షాక్ కొట్టి ఎంతోమంది రైతులు సచ్చింన్రు. రాత్రిపూట సేన్లకాడ పండుకొని ఎంతోమంది పాముకాటుకు, విషపురుగులకు బలయ్యింన్రు. అప్పట్ల ఆ కష్టాలతోటి ఎవుసాన్ని వదిలి శానామంది ఉప్పరి పనికి పోయింన్రు. ఇండ్లకు తాళాలు వేసి సేన్లను బీళ్లు పెట్టి ఊరుగాని ఊరికి కూలిపని కోసం పోయి కడుపు నింపుకొనేటోళ్లు. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు సీఎం అయ్యి కరెంట్ కష్టాలు లేకుండా చేసిండు. ఇండ్లకు, ఎవుసానికి 24 గంటలు ఉచిత కరెంటిచ్చిండు. పగటిపూటనే మోటర్లు పెట్టుకొని మడులు పారిచ్చుకునేటోళ్లం. రైతుబంధుతో పెట్టుబడి సాయం అందజేసి ఎరువులు, విత్తనాలు సకాలంలో ఇచ్చి రైతులను ఆదుకున్నరు. ఈ దెబ్బకు ఊరు ఇడిసి వలస పోయినోళ్లందరూ తిరిగొచ్చింన్రు. పదేండ్ల పాటు ఎవుసాన్ని పండుగలెక్క చేసుకున్నం. రైతులకు అన్నిరకాలుగా మంచిచేసింది మాత్రం కేసీఆర్ సారే. ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ సర్కారు కరెంట్ కోతలను మళ్లీ తీసుకొచ్చింది. రైతుల పరిస్థితి శానా కష్టంగా మారింది. రానురాను ఇంకేమైతదో అని భయమైతుంది. కేసీఆర్ సారు ఉండింటే ఇట్లా కాకుండె. కట్టింగ్స్ లేకుండా కరెంట్ ఇవ్వాలంటే కేసీఆర్ సారే రావాలి.

*- తిరుపతయ్య, రైతు, ఆరేపల్లి, ఆత్మకూరు మండలం, వనపర్తి జిల్లా*

### పదేండ్లు కరెంట్ కోతలు చూడలేదు..



కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర సాధకుడు కేసీఆర్ సీఎం అయ్యినంక వ్యవసాయానికి పెద్దపీట వేసిండు. అందులో భాగంగానే 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తానని మాట ఇచ్చి పదేండ్ల ఆయన పాలనలో కరెంట్ కోతలు చూడలేదు. వ్యవసాయం చేసే ప్రతి రైతు కేసీఆర్ సార్ పాలనలో వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్నాడు. కాంగ్రెస్ పాలన సురువైన తర్వాత ప్రతి రోజూ కరెంట్ కోతలే చూస్తున్నాం. ఎప్పుడు కరెంట్ వస్తుందో ఎప్పుడు పోతుందో తెలుస్తలేదు. కరెంట్ కోతలు ఉండడంతో పంటలు పండుతాయన్న నమ్మకం లేదు.

*- రామచంద్రయ్య, రైతు, ఖిల్లాఘణపురం, వనపర్తి జిల్లా*



### కరెంట్ కోసం కేసీఆర్‌కే ఓటేస్తరు..

ఎండాకాలం కూడా కరెంట్ కోసం ఇంత తిప్పలు పడలే. నాకున్న నాలుగెకరాల్లో నాటుకునేందుకు నారుపోసుకున్న. ఇప్పుడు కరెంట్ సక్కగ లేక నారు ఎండిపోయేటట్లు ఉంది. ఇంతగానం కరెంట్ తీస్తే.. కరిగెట చేయాలన్నా.. నాట్లు వేసుకోవాలన్నా తిప్పలైతది. టీవీల ముందర కూసుంటే పెద్ద, పెద్ద వానలు పడినయని చెప్తున్నరు. అవబ్బా నీళ్లకు ఇబ్బంది ఉంది అన్నిక్కె లేదు. డ్యాంలల్ల నీళ్లు మస్తుండాయి. కరెంటేమో ఒకటే తీస్తరు. ఇన్ని దినాలు ఇట్లా లేకుండె అబ్బా. నేను కొన్నేండ్ల నుంచి అడివి పని చేస్తున్న కానీ.. ఈసారి కరెంట్ కోసం మంది చాన తిప్పలు పడుతున్నరు. ఇప్పుడింతల ఎలక్షన్ గిట్లా వస్తే కరెంట్ కోసం కేసీఆర్‌కే ఓట్లేస్తరు.

*- కావలి రాజు, రైతు, బీసీ కాలనీ, అమరచింత , వనపర్తి జిల్లా*

- కురిసిన వర్షం.. హలం పట్టిన రైతన్న
- గద్వాల జిల్లాలో విత్తుతున్న విత్తనాలు
- నల్లరేగడిలో మెరవనున్న తెల్లబంగారం
- 1,70,114 ఎకరాల్లో పంట సాగు అంచనా
- బిజీబిజీగా కర్షకులు

**గంపెడాశలతో రైతన్నలు వానకాలం సాగు పనులు మొదలుపెట్టారు. కురిసిన వర్షంతో హలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. కొందరు ఇప్పటికే విత్తనాలు విత్తి గుంటుక కొడుతుండగా.. ఉత్సాహంగా కూలీలు కలుపు తీసే పనిలో నిమగ్నమయ్యారు.. మరికొందరు విత్తనాల కొనుగోలు, సాగు పనుల్లో తలమునకలయ్యారు. ఈ సీజన్‌లో జోగులాంబ గద్వాల జిల్లాలోని నల్లరేగడి భూమిలో తెల్లబంగారం మెరిసిపోనున్నది. 1,70,114 ఎకరాల్లో పంట సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారుల అంచనా.. తర్వాతి స్థానంలో 94,386 ఎకరాల్లో వరి, 75,843 ఎకరాల్లో మిరప, 26,249 ఎకరాల్లో కందులు, 15,266 ఎకరాల్లో మొక్కజొన్న, 28,290 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు కానున్నాయి. ఇందుకు అవసరమైన 1,13,922 మెట్రిక్ టన్నుల ఎరువులను యంత్రాంగం అందుబాటులో ఉంచింది.**

*- గద్వాల, జూన్ 26*

# గంపెడాశలతో..

## వానకాలం సాగులో రైతన్నల నిమగ్నం

వారం రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆశల సాగుకు సిద్ధమయ్యారు. రైతుకు కాలం కలిసి వచ్చినా.. రాకున్నా వ్యవసాయంపై ఆశలు వదులుకోక ఈ ఏడాది నష్టం వాటిల్లినా వచ్చే ఏడాదైనా కాలం కలిసి రాదా అనే ధైర్యంతో రైతన్న ముందుకు సాగుతున్నాడు. గత వానకాలంలో సరైన వర్షాలు కురియకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలకు నీరుఅందక ఎండిపోయి తీవ్రంగా నష్టపోయాడు. ఎండిన పంటలను పశువుల మేతకు వదిలి వేశాడు. ఈ వానకాలమైనా కాలం కలిసి రాక పోదా అనే గంపెడాశతో సాగుకు సన్నద్ధమయ్యారు. కాలం కలిసి వస్తే అప్పులు పోను కడుపు నిండా అన్నం దొరుకుతుందనే ఆశతో సాగు చేస్తున్నారు. వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పడంతో రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మురిసి పంటల సాగు చేశారు.



విత్తనాలు విత్తడం కోసం పొలంలో ఎరువులు చల్లుతున్న కూలీలు

***ముమ్మరంగా పొలం పనులు..***

గత నెల చివరిలో వర్షం కురియగా మిరప, పత్తి, టమాట, మొక్కజొన్న, కందులు, వేరుశనగ తదితర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం అవి మొలకెత్తడంతో రైతులు మొక్కల మధ్య ఉన్న గడ్డిని తొలగించేందుకు గడెంతో గుంటుక కొడుతున్నారు. మరికొందరు మొక్కల మధ్య ఉన్న కలుపు మొక్కలను కూలీలతో తీయిస్తున్నారు. వర్షాలకు పొలం పదునుగా ఉండడంతో ఎరువులు చల్లి విత్తనాలు విత్తడానికి పొలాలను సిద్ధం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో అటు రైతులు పొలం పనుల్లో ఇటు కూలీలు కూలి పనుల్లో బిజీబిజీగా మారిపోయారు. జూరాల, నెట్టెంపాడ్, ఆర్డీఎస్ ద్వారా కాల్వలకు నీరు వదిలితే రైతులు నారుమడులు పోసుకోవడానికి తమ పొలాలను సిద్ధం చేసి ఉంచుకున్నారు. ఈ వర్షాలు ఇలాగే కురిస్తే ఈ ఏడాది రైతన్నకు కలిసి వచ్చే అవకాశం ఉన్నది.

***ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు..***

జిల్లాలో అధికారులు ఎరువుల విత్తనాల కొరత లేకుండా చూస్తున్నారు. ఈ వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు 1,13,922 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేశారు. ప్ర స్తుతం రైతులకు అవసరమై న ఎరువులు అందుబాటులో వ్యవసాయ శాఖ అధికారులు ఉంచారు. జిల్లాకు వరి విత్త నాలు 23,597 క్వింటాళ్లు అ వ సరం కాగా.. ప్రస్తుతం 2,582 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు మొక్కజొన్న 1,221 క్విం టాళ్లు అవసరం కాగా 170 క్వింటాళ్లు, కందులు 1,050 క్వింటాళ్లు అవసరం కాగా 255 క్విం టాళ్లు , కాటన్ ప్యాకెట్లు 3,40,228 అవసరం కాగా 1,07,949 ప్యాకెట్లు, చిల్లీ 114 ప్యాకెట్లకు గానూ 82 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే అవసరం మేరకు ఎరువులు, విత్తన దుకాణదారులు స్టాక్ ఉంచుతున్నారు. ఎరువులు, విత్తనాల విషయంలో ఇప్పటివరకు ఎటువంటి కొరత లేదని రైతుల అవసరం మేరకు సరఫరా చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి తెలిపారు.



గద్వాల మండలం పరమాల సమీపంలోని వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు, కూలీలు

### సొంతంగా విత్తనాలు కొన్నాం..



ముందస్తు వర్షాలు కురవడంతో విత్తనాలు విత్తుకున్నాం. ప్రస్తుతం మొలకలు వచ్చాయి. ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేశా.. గత కేసీఆర్ సర్కారు మొక్కలు మెలిచే నాటికి రైతుబంధు సాయం అందించగా.. సాగు ఖర్చులు పోను మొదటి విడుత పెట్టుబడికి సరిపోతుండే.. ఈ వానకాలం ఈ ప్రభుత్వం ఎప్పుడు పెట్టుబడి సాయం అందిస్తుందో తెల్వడం లేదు. ప్రస్తుతం పొలంలో కూలీలతో గడ్డి తీయిస్తున్నాం. ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులూ పెరిగాయి.

*- కృష్ణ, రైతు, కుర్వపల్లి, గద్వాల మండలం*

### పెట్టుబడి సాయం అందించాలి..



నేను రెండు ఎకరాల్లో సీడ్ ఆర్గనైజర్ల వద్ద పత్తి విత్తనాలు తీసుకొచ్చి విత్తనాలు విత్తాను ప్రస్తుతం అవి మొలక దశలో ఉన్నాయి. అవి కొద్దిగా పెరిగితే కలుపుతోపాటు ఎరువులకు డబ్బులు అవసర మవుతాయి. పెట్టుబడి ఇప్పటి వరకు సొంతంగా పెట్టుకున్నాను. గత ప్రభుత్వం లాగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం త్వరగా అందజేస్తే ఎరువులకు ఉపయోగపడతాయి. ఈ ఏడాది కాలం కలిసి వస్తే అప్పులు తీరి నాలుగు పైసలు చేతికి వస్తాయి.

*- నర్సింహులు, రైతు, సద్దలోనిపల్లి, మల్దకల్ మండలం*

### జోగులాంబ గద్వాల జిల్లాలో ఇలా..

జోగుళాంబ గద్వాల జిల్లాలో నల్లరేగడి, ఎర్రనేలలు ఎక్కువగా ఉన్నాయి. నల్లరేగడిలో రైతులు ఎక్కువగా పత్తితో పాటు మిర్చి, వరి, కందులు సాగు చేయగా ఎర్రనేలల్లో రైతులు వేరుశనగ, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. ఈ వానకాలంలో రైతులు జిల్లాలో 94,386 ఎకరాల్లో వరి, మొక్కజొన్న 15,266 ఎకరాలు, కందులు 26,249 ఎకరాలు, పత్తి 1,70,114 ఎకరాల్లో, మిర్చి 75,843 ఎకరాలు, వేరుశనగ 8,797 ఎకరాలు ఉద్యానవ పంటలు 28,290 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు.

# పాల బిల్లులు చెల్లించాలి

- ఉప్పునుంతలలో పాడి రైతుల ఆందోళన
- రోడ్డుపై పాలుపోసి నిరసన

ఉప్పునంతల, జూన్ 26 : ప్రభుత్వం పాల బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ మండలకేంద్రంలోని పోశమ్మ చౌరస్తాలో బుధవారం విజయ పాడి రైతులు ఆందోళన నిర్వహించారు. అదేవిధంగా రోడ్డుపై పాలు పోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రెండు నెలలుగా పాల బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కనీస అవసరాలు తీర్చుకోలేని స్థితిలో పాడి రైతులు ఉన్నారని, కేవలం విజయ పాల డెయిరీని మాత్రమే నమ్ముకొని ప్రైవేట్ డెయిరీ ప్రలోభాలకు లొంగకుండా విజయ డెయిరీని ప్రోత్సహిస్తున్న పాడి రైతులకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సకాలంలో బిల్లులు వచ్చేవని, ఇప్పుడు ఎందుకు రావడం లేదో అర్థం కావడం లేదన్నారు. అనంతర నడింపల్లి రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ పాడి పరిశ్రమ నిర్వహిస్తూ వచ్చిన డబ్బులతో తన పిల్లలను చదివించుకుంటున్నానని, సకాలంలో డబ్బులు రాకపోవడంతో పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నామన్నారు. ఇంటి అద్దె, బిల్లులు కూడా చెల్లించకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరికీ రూ.లక్ష, రెండు లక్షలు బిల్లులు రావాల్సి ఉందన్నారు. పాల బిల్లు రాకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులతో అప్పు తీసుకుంటున్నామని తెలిపారు. మరో రైతు సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ రూ.2లక్షలు రావాల్సి ఉందని, బిల్లుల కోసం ఎదురుచూస్తున్నానని వాపోయాడు. ఉప్పునుంతలలో దాదాపు రూ.60 లక్షల నుంచి 70 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పాడి రైతులు చీమర్ల జంగిరెడ్డి, సంతోష్‌రెడ్డి, లింగమయ్య, పర్వతాలు, శివశంకర్, రాములు, శేఖర్, రామకృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై పాలు పారబోసి నిరసన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు

### బిల్లులు విడుదల చేయాలి



కేవలం పాడినే నమ్ముకొని బతుకుతున్నాం. దాదాపు లక్ష రూపాయల బిల్లులు రావాల్సి ఉంది. నాలుగు విడుతలుగా బిల్లులు రావడం లేదు. పాలను నమ్ముకొని చీటీలు వేశాను. బిల్లు రాకపోవడంతో చీటీలు కట్టలేకపోతున్నా. తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలి.

*- మెడమోని శేఖర్, రైతు, ఉప్పునుంతల*

# 'మత్తు వదలరా?'పై విచారణ

- 'నమస్తే తెలంగాణ' కథనంపై అధికారులు సీరియస్
- కొల్లూరులో విచారణ చేపట్టిన ఏఎంవో శ్రీనివాస్
- రెండు రోజుల్లో చర్యలు తీసుకునే అవకాశం

నవాబ్‌పేట, జూన్ 26 : మండలంలోని కొల్లూరు ఉన్నత పాఠశాలలో గత 24వ తేదీన ఉపాధ్యాయులు విధి నిర్వహణ సమయంలో గదిలో కునుకు తీయడంపై సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. 'మత్తు వదలరా..' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖాధికారులు స్పందించారు. బుధవారం ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ కొల్లూరు ఉన్నత పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుల అలసత్వంపై ఆరా తీశారు. స్టాఫ్ రూంలో నిద్రించిన ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులు తిరిగి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంవో మాట్లాడుతూ పత్రికలో వచ్చిన కథనం మేరకు డీఈవో రవీందర్ ఆదేశానుసారం విచారణ చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల సమయంలో ఉపాధ్యాయులు లీజర్ పీరియడ్ ఉన్నా.. నిద్రించేందుకు వీలు లేదన్నారు. గతంలో ఈ పాఠశాలలో పది ఫలితాల్లో జీరో రిజల్ట్ వచ్చిన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు సైతం సీరియస్‌గానే ఉన్నట్లు తెలిపారు. విచారణ నివేదికను డీఈవోకు అందజేయనున్నట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా డీఈవో చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.



కొల్లూరు పాఠశాలలో విచారణ చేపడుతున్న ఏఎంవో శ్రీనివాస్